క్లుప్తంగా

'చదవడం మాకిష్టం'పై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

ప్రత్తిపాడు: చదవడం మాకిష్టం కార్యక్రమంపై ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని మండల విద్యాశాఖాధికారి సీహెచ్. రమాదేవి తెలిపారు. 2022–23 విద్యా సంవత్సరం ఆదివారంతో ముగిసింది. సోమవారం నుంచి పాఠశాలలకు జూన్ 11 వరకు పాఠశాలలకు ప్రభుత్వం వేసవి సెలవుల్ని ప్రకటించింది. వేసవిలోనూ విద్యాభివృద్ధి దృష్ట్యా ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉయ్ లవ్ రీడింగ్‌పై విద్యార్థులు, తల్లిదండ్రులు దృష్టి సారించాలన్నారు. సంబంధిత తరగతుల ఉపాధ్యాయులు, పాఠశాలల హెచ్ఎంలు ప్రతి రోజూ మానిటర్ చేస్తూ కార్యక్రమం సక్రమంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎంఈవో ఆదేశించారు. నలభై రోజులపాటు జరగనున్న చదవడం మాకిష్టం కార్యక్రమంలో విద్యార్థులు పోటీతత్వంతో చదవడం, రాయడాన్ని చేయాలని తెలిపారు. పోటీలు కూడా ఉంటాయని, పాల్గొనేందుకు విద్యార్థులు ఆసక్తి చూపేలా విద్యార్థుల పేరెంట్స్ చొరవ చూపాలని ఎంఈవో రమాదేవి చెప్పారు.

సేంద్రియ సాగుతో ఆరోగ్యకర పంటలు


మహిళా రైతుకు సర్టిఫికెట్‌ను అందిస్తున్న డాక్టర్ పూర్ణచంద్

గుంటూరు రూరల్: తినే ఆహారం శక్తితో పాటు ఆరోగ్యాన్ని కాపాడేదిగా ఉండాలని అందుకు సేంద్రియ వ్యవసాయం ఎంతో ఉపయోగపడుతుందని ఉద్యానశాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంట నందున్న రైతునేస్తం ఫౌండేషన్‌లో రెండు రోజుల నుంచి నిర్వహిస్తున్న సేంద్రియ సాగు, కషాయాల తయారీ, విలువల జోడింపుపై రైతు శిక్షణ తరగతులు సోమవారంతో ముగిశాయి. కార్యక్రమంలో భాగంగా ఉద్యాన శాఖ సహాయ సంచాలకులు మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయంతో రైతులు తక్కువ ఖర్చుతో మంచి దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. పంటలు కూడా ఆరోగ్యకరంగా ఉంటాయని తద్వారా ప్రజలు కూడా ఆరోగ్యంగా జీవిస్తారని చెప్పారు. పర్యావరణ పరిరక్షణతో పాటు భూమి కాలుష్యాన్ని నివారించవచ్చని పేర్కొన్నారు. ఉద్యాన పంటల్లో సేంద్రియ విధానాలు, యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. డాక్టర్ జి.వి. పూర్ణచంద్ మాట్లాడుతూ ప్రస్తుత ఆహారపు అలవాట్లను పరిశీలిస్తే తినే ఆహారం శక్తిని సక్రమంగా ఇవ్వడం లేదని చెప్పారు. రసాయనాలతో పండించిన ఆహారాన్ని తీసుకోవడంతో ఆరోగ్యం దెబ్బతింటోందని పేర్కొన్నారు. ప్రజలంతా ఆరోగ్యకరమైన ఆహారం వైపు అడుగులు వేయాలని ఆయన సూచించారు. తినే ఆహారం ఔషధంలా పని చేయాలని చెప్పారు. అనంతరం శిక్షణ తరగతుల్లో పాల్గొన్న రైతులకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో సేంద్రియ రైతులు మీసాల రామకృష్ణ, శబరీనాథ్, ఏడుకొండలు, రైతునేస్తం ఫౌండేషన్‌చైర్మన్ యడ్లపల్లి వెంకటేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ స్టేడియంలో ఈత శిక్షణ శిబిరం ప్రారంభం



గుంటూరు వెస్ట్ (క్రీడలు): చిన్నారులు తీవ్రమైన చదువు ఒత్తిడితో పాటు ఆటపాటలు లేకపోవడం వల్ల అనారోగ్యానికి గురవుతున్నారని శాసనమండలి సభ్యుడు లేళ్ల అప్పిరెడ్డి తెలిపారు. స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలోని స్విమ్మింగ్ పూల్‌లో సోమవారం వేసవి శిక్షణ శిబిరాన్ని ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడుతో కలసి ప్రారంభించారు. అప్పిరెడ్డి మాట్లాడుతూ ఎందరో ప్రముఖ క్రీడాకారులు వేసవి శిక్షణ ద్వారా వెలుగులోకి వచ్చారన్నారు. తల్లిదండ్రులు కూడా వేసవి సెలవుల్లో చిన్నారుల్ని శిక్షణ కేంద్రాలకు, మైదానాలకు పంపాలని ఆయన కోరారు. సెలవుల్లో పిల్లలు ఎక్కువగా సెల్‌ఫోన్లు, ట్యాబ్‌లతో గడుపుతారన్నారు. కాసేపు అయినా క్రీడా సాధన చేస్తే కొంత ఆట విడుపుతోపాటు ఆరోగ్యం కూడా లభిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు గోపి శ్రీనివాస్, షేక్ రోషన్, జీఎంసీ వీసీ సీహెచ్. శ్రీనివాసరావు, అధికారులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలతోనే కార్మికుల హక్కులు సాధన

ఘనంగా మేడే వేడుకలు


ప్రత్తిపాడులో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆటోవర్కర్స్, బిల్డింగ్ వర్కర్స్ మేడే వేడుకలు


ప్రత్తిపాడులో సీపీఐ ఆధ్వర్యంలో మేడే జెండా ఆవిష్కరణ


చేబ్రోలు కచేరి సెంటర్‌లో వేడుకలు


పొన్నూరులో మేడే వేడుకలు


పెదనందిపాడులో జెండాను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నేతలు


కాకుమానులో మాట్లాడుతున్న కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బైరగాని శ్రీనివాసరావు

ప్రత్తిపాడు: కార్మికవర్గం ఐక్యంగా పోరాటాలు చేసి సాధించుకున్న హక్కుల్ని కాలరాస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దింపాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి. లక్ష్మణరావు పిలుపునిచ్చారు. ప్రత్తిపాడులో సోమవారం ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని నిర్వహించారు. బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ కార్మికులతో పాటు వంగిపురం, బోయపాలెం, కోండ్రుపాడు, బస్టాండు ఆటో సెంటర్ల వద్ద మేడే, సీఐటీయూ జెండాల్ని ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా హాజరైన లక్ష్మణరావు మాట్లాడుతూ కార్మికవర్గం పోరాడి సాధించుకున్న హక్కుల్ని కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని, అందు కోసమే లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందని విమర్శించారు. ఎనిమిది గంటల పని విధానానికి బదులు పన్నెండు గంటలు తీసుకు వచ్చేందుకు కసరత్తు చేస్తోందని విమర్శించారు. పెట్రోల్, డీజిల్‌పై రెండింతల ధరలు తొమ్మిదేళ్లలో పెరిగాయని తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి చెల్లి రమేష్, సీఐటీయూ నాయకులు కె. ఆదినారాయణ, ఆటో యూనియన్ నాయకులు జి. నాగరాజు, మాణిక్యరావు, బిల్డింగ్ వర్కర్స్ నాయకులు కోటేశ్వరరావు, రాజు పాల్గొన్నారు.

సీపీఐ ఆధ్వర్యంలో..

ప్రత్తిపాడులో సీపీఐ ఆధ్వర్యంలో మేడే వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక గుంటూరు–పర్చూరు పాత మద్రాసు రోడ్డులోని సివిల్ సప్లయిస్ గొడౌన్ వద్ద పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఆదేశ్వరరావు మేడే జెండాను కార్మికులతో కలసి ఆవిష్కరించారు. కార్మికులకు మిఠాయిల్ని పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆదేశ్వరరావు మాట్లాడుతూ కార్మికుల జీవితాల్లో వెలుగులు రావాలంటే పోరాటాలు ఒక్కటే మార్గమని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నేత పోతురాజు లక్ష్మీనారాయణ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

చేబ్రోలులో....

మండలంలోని పలు ప్రాంతాల్లో సోమవారం మేడే వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక కచేరి సెంటర్ వద్ద, పంచాయతీ కార్యాలయం వద్ద పంచాయతీ కార్మికులు, చేబ్రోలు ముట్లూరు రోడ్డు వద్ద ఆటో కార్మికులు, కొత్తరెడ్డిపాలెంలో భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో, వడ్లమూడి సీడబ్ల్యూసీ గోడౌన్స్ వద్ద ముఠా కార్మిక సంఘం ఆధ్వర్యంలో జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దండా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాల్ని మేడే స్ఫూర్తితో తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పి.చౌడయ్య, సీహెచ్. హనుమంతరావు, ఆదిశేషు, పుల్లయ్య, థామస్, శ్రీనివాసరావు, రిక్షా వర్కర్స్ యూనియన్ నాయకులు సుబ్బారావు, అబ్రహం, ఆటో యూనియన్ నాయకులు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పొన్నూరులో....

కార్మిక శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా చేసిన పోరాట ఫలితమే మేడే అని పౌరహక్కుల సంఘం అధ్యక్షుడు టి. రాజారావు తెలిపారు. పొన్నూరు జీబీసీ రోడ్డులో సోమవారం మేడే జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో సొంగా జాకబ్ పాల్గొన్నారు.

■ స్థానిక ఆటో నగర్‌లోని జెండా చెట్టు వద్ద సోమవారం ఉస్మాన్ మేస్త్రి ఆధ్వర్యంలో మేడే వేడుకలు నిర్వహించారు. స్థానిక నాయకులు, ఆటో వర్కర్స్ పాల్గొన్నారు.

పెదనందిపాడులో..

సీఐటీయూ ఆధ్వర్యంలో పెదనందిపాడు పాత బస్టాండ్ సెంటర్‌లో మేడే జెండాను జిల్లా నాయకుడు కాకుమాను నాగేశ్వరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్మిక సంఘాలు పోరాడి సాధించుకున్న హక్కుల్ని నిర్వీర్యం చేసేందుకే లేబర్ కోడ్లతో పాటు 12 గంటల పని విధానం తీసుకురావాలని చూస్తోందని తెలిపారు. మోటారు వాహన చట్టం సవరణ ద్వారా రవాణా రంగం పూర్తిగా దివాళా తీస్తోందన్నారు. బిల్డింగ్ వర్కర్లకు సంక్షేమ బోర్డు ప్రకారం సౌకర్యాల కల్పన ఈ నాలుగేళ్లలో రాష్ట్రంలోనూ నిలిచిపోయిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వాన్ని గద్దె దింపడమే దీనికి పరిష్కారమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు దొప్పలపూడి రమేష్, ముద్దన వెంకటేశ్వర్లు, రైతు ఐక్య వేదిక నాయకులు నరిశెట్టి ఆచారి, హరిబాబు, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు రాము, వెంకటేష్, ఎం. రమణ, డి. శ్రీను, వివిధ కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కాకుమానులో..

భవన నిర్మాణ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో మేడే వేడుకల్ని కాకుమానులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బైరగాని శ్రీనివాసరావు మాట్లాడుతూ అనాదిగా కార్మికుల్ని ప్రభుత్వాలు చిన్నచూపు చూస్తూనే ఉన్నాయన్నారు. సమస్యల పరిష్కారానికి కార్మికులంతా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. మండల శాఖ అధ్యక్షుడు కందుల శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్నా కార్మికుల కష్టాలు తీరడం లేదన్నారు. ముఖ్యంగా భవన నిర్మాణ కార్మికుల పరిస్థితి దారుణంగా ఉందని, వారి ప్రాణానికి రక్షణ లేకుండా పోయిందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ప్రతీ కూలీకి బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. కార్మికుల పిల్లలకు పాఠశాలల్లో ఉచిత ప్రవేశం, స్కాలర్ షిప్‌లు తదితర వసతులు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. తొలుత ఉర్దూ పాఠశాల సమీపంలో జెండాను ఎగురవేసి, గ్రామ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు.

పెదకాకానిలో..

ఐకమత్యంతో కార్మికులు సమస్యలు పరిష్కరించుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వై. నేతాజీ తెలిపారు. మేడే పురస్కరించుకుని సీఐటీయూ ఆధ్వర్యంలో పెదకాకాని గ్రామ పంచాయతీ వద్ద సీఐటీయూ పతాకాన్ని గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు పి. ఆదిలక్ష్మి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నేతాజీ మాట్లాడుతూ 1886లో మేలో చికాగో నగరంలో ఎనిమిది గంటల పని దినం కోసం జరిగిన కార్మిక పోరాటమే మేడేగా ప్రసిద్ధికెక్కిందని వివరించారు. ఆ తరువాత ప్రపంచంలోని అన్ని దేశాల్లో కార్మిక వర్గాలు పోరాటాల ద్వారా ఎనిమిది గంటల పని దినాన్ని సాధించుకున్నట్లు చెప్పారు.


సీఐటీయూ ఆధ్వర్యంలో వేడుకలు

కార్యక్రమంలో నేతలు నన్నపనేని శివాజీ, కె.సత్యనారాయణ, బి. సాంబయ్య, ఎస్. నీలాంబరం, బి. బాబూరావు పాల్గొన్నారు.

■ పెదకాకాని వెనిగండ్ల ఆటోనగర్‌లో ఏఐటీయూసీ జెండాను నేతలు ఆవిష్కరించారు. కార్యక్రమానికి పాటిబండ్ల డేవిడ్‌రాజు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పొన్నూరు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ మాట్లాడుతూ మేడే స్ఫూర్తితో కార్మికులంతా నేడు ఐక్య పోరాటాలకు సిద్ధంకావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కేతినేని అగస్టిన్, మండల మహిళా సమైక్య కార్యదర్శి రెంటాల కుమారి, గోపి సుబ్బారావు, నారా ప్రసాద్, దర్శి లింగారావు, ఈశ్వరరావు, కోటిపల్లి వేణు, గురువారెడ్డి, వీరయ్య, వెంకటప్పారెడ్డి పాల్గొన్నారు.


ఏఐటీయూసీ ఆధ్వర్యంలో..

వైఎస్సార్ సీపీపై దుష్ప్రచారం తగదు


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎస్ఎంఈ డైరెక్టర్ విజయలక్ష్మి, నేతలు

పెదకాకాని: వైఎస్సార్ సీపీలో పదవులు అనుభవించి ఆ పార్టీపైనే దుష్ప్రచారం చేయడం సమంజసం కాదని ఎంఎస్ఎంఈ డైరెక్టర్ భీమవరపు విజయలక్ష్మి ఖండించారు. స్థానిక ఎమ్మెల్యే డబ్బులు తీసుకుని పదవులు ఇచ్చారని అసత్య ప్రచారం చేయడంపై పెదకాకానిలో సోమవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ముసుగులో కొంతమంది పదవులు అనుభవించి, ఎమ్మెల్యే ద్వారా లబ్ధి పొంది స్థానిక పంచాయతీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులకు వెన్నుపోటు పొడిచారని ధ్వజమెత్తారు. తాజాగా స్థానిక శాసనసభ్యులు, పార్టీ నాయకులు మీదా దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. పార్టీ అభ్యున్నతి కోసం కష్టపడి పని చేసిన వారిని గుర్తించి ఎమ్మెల్యే సముచిత న్యాయం కల్పించి పదవులు ఇస్తే, దానికి కొంతమంది డబ్బులు తీసుకొని పదవులు ఇచ్చారని ప్రచారం చేయడం దురదృష్టకరమని ఖండించారు. పార్టీకి నష్టం కలిగించే వారిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ సయ్యద్ సుబాని, పెదకాకాని పీఏసీఎస్ చైర్‌పర్సన్ భీమవరపు కోటిరెడ్డి, పొన్నూరు వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్లు బందెల ఉదయ శంకర్, జొన్నల కరుణాకర్‌రెడ్డి, కొంకి రామారావు, పెదకాకాని సచివాలయం కన్వీనర్ మురికిపూడి ఆదిలక్ష్మి, జేసీఎస్ మండల కన్వీనర్ చాగంటి మురళీమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

టీపీబీఓ రసూల్ సస్పెన్షన్

నెహ్రూనగర్: విధుల్లో నిర్లక్ష్యంతో పాటు నిబంధనలకు విరుద్ధంగా నోటీసులు జారీ చేసిన టీపీబీఓ రసూల్‌ని సస్పెండ్ చేసినట్లు నగర కమిషనర్ కీర్తి చేకూరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో జరుగుతున్న నిర్మాణానికి నగరపాలక సంస్థ ఉన్నతాధికారుల నుంచి అనుమతులు లేకుండా నోటీసులు జారీ చేయడమే కాకుండా, నోటీసు ప్రకారం గడువు వరకు వేచి ఉండకుండా నిర్మాణాన్ని ప్రణాళిక అధికారులు తొలగించారని పేర్కొన్నారు. దీనిపై టీపీబీఓ రసూల్‌ని విధుల నుంచి సస్పెండ్ చేయడంతో పాటు ఏసీపీ కాలేషా, డీసీపీ కోటయ్యకు షోకాజ్ నోటీసులు జారీ చేశామని తెలియజేశారు. అధికారులు అంకితభావంతో పని చేస్తూ జీఎంసీకి మంచి పేరు తేవాలని, నిర్లక్ష్యంగా ఉండే వారిపై కఠిన చర్యలు తప్పవని ఆమె స్పష్టం చేశారు.

బీసీల సంక్షేమానికి సీఎం జగన్ ప్రాధాన్యత

- ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య
- ఉప్పరపాలెం భారతీనగర్ సొసైటీ పాలకవర్గ ప్రమాణం


సొసైటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య, తాడిశెట్టి మురళి తదితరులు

పొన్నూరు(చేబ్రోలు): బీసీల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారని పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య పేర్కొన్నారు. పొన్నూరు మండలం ఉప్పరపాలెంలోని భారతీ నగర్ పీఏసీఎస్ సొసైటీ నూతన పాలకవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సం సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య మాట్లాడుతూ టీడీపీ బీసీల్ని కేవలం ఓటు బ్యాంకుగా వాడుకుందని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి బీసీలకు అనేక కార్పొరేషన్లు ఏర్పాటు చేసి ప్రాధాన్యత కల్పించి పెద్దపీట వేశారని తెలిపారు. బీసీల్ని ఆర్థికంగా బలోపేతంతో పాటు రాజకీయంగా, సామాజికంగా అధిక ప్రాధాన్యత ఇస్తూ సంక్షేమ పథకాలు అమలు చేస్తుంటే ప్రతిపక్ష నేత చంద్రబాబు ప్రభుత్వంపై విషం చిమ్ముతున్నారని విమర్శించారు. సగరులకు నామినేటెడ్ పదవులతో ప్రాధాన్యత కల్పిస్తున్నామని తెలిపారు. అనంతరం సొసైటీ అధ్యక్షుడు ముద్రబోయిన బుజ్జిబాబు, పాలకవర్గ సభ్యులు తలతోటి కామయ్య, గుర్రంకొండ సురేష్ లతో ఇంచార్జ్ సీఈవో హరిగోపుల సావిత్రి ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన పాలకవర్గ సభ్యుల్ని శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య అభినందించారు.

వైఎస్సార్ సీపీలో 150 మంది చేరిక

పొన్నూరు ఉప్పరపాలెం గ్రామానికి చెందిన 150 మంది టీడీపీ ప్రత్యేక ఆహ్వానితుడు తాడిశెట్టి మురళి ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలో సోమవారం చేరారు. ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, స్టేట్ మైనార్టీ కమిషన్ సభ్యుడు షేక్ సైపుల్లా, సర్పంచులు ముద్రబోయిన తిరుపతయ్య, జాలాది యానాదిరావు, చుండూరు వీరయ్య పాల్గొన్నారు.

టెక్నికల్ కోర్సులతో సత్వర ఉపాధి


ఉద్యోగాలు పొందిన విద్యార్థుల తల్లిదండ్రులకు సన్మానం

గుంటూరు రూరల్: టెక్నికల్ విద్యా కోర్సుల ద్వారా విద్యార్థులు త్వరితగతిని ఉపాధి పొందవచ్చని నాగ సింధూ స్పిన్నింగ్ అండ్ జిన్నింగ్ మిల్స్ ప్రైవేట్ లిమిటెడ్ టెక్నికల్ డైరెక్టర్ ఆర్. శ్రీనివాసరావు తెలిపారు. నల్లపాడులోని ఎమ్‌బీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్ టెక్స్‌టైల్స్ కళాశాలలో సోమవారం ప్రాంగణ ఎంపికల్లో ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థుల తల్లిదండ్రులను సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ నైపుణ్యాలు కలిగిన విద్యార్థుల్ని టెక్స్‌టైల్స్ సంస్థలకు అందిస్తున్న కళాశాల యాజమాన్యాన్ని అభినందించారు. కళాశాల ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్స్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 2022–23 బ్యాచ్‌లో 18 మంది విద్యార్థులకు 17 మంది ఉద్యోగాలకు అర్హత సాధించారని, ఒకరు పై చదువులకు వెళ్లినట్లు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరమణ, చల్లావారిపాలెం గ్రామ సర్పంచ్ ఆరుదల సాంబశివరావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదివి ఉన్నత లక్ష్యాల సాధన దిశగా కృషి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో టెక్స్‌టైల్స్ శాఖ అధికారి కె.మహమ్మద్, సీనియర్ లెక్చరర్ యు. రాధాకృష్ణ, ఎస్. నాగేశ్వరరావు, బి. వెంకటేశ్వర్లు, ఏ. జనార్దనరావు, జి. లక్ష్మిజ్యోతి, కృష్ణారావు, జ్యోతిర్మయి, ఎం. నాగేశ్వరరావు పాల్గొన్నారు.

యూటీఎఫ్ నూతన భవనం ప్రారంభం


భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

చేబ్రోలు: యూటీఎఫ్ మండల కార్యాలయాన్ని ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు, సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. వెంకటేశ్వర్లు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో లక్ష్మణరావు మాట్లాడుతూ భవనం ఉద్యమ, విజ్ఞాన కేంద్రంగా రూపొందించడానికి కృషి చేయాలని తెలిపారు. యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నేతలు ఉపాధ్యాయ సమస్యలతో పాటు కార్మిక, రైతు సమస్యలపై కూడా స్పందించాలని పిలుపునిచ్చారు. సంఘ రాష్ట్ర నాయకురాలు కుసుమ కుమారి మాట్లాడుతూ ఇప్పటి వరకు గుంటూరు, తెనాలి, పొన్నూరులో భవనాలు ఉన్నాయని, నాలుగో కార్యాలయంగా చేబ్రోలులో నిర్మించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎం. హనుమంతరావు, బి. ఆదిలక్ష్మి, ఎం. కళాధర్ పాల్గొన్నారు.

శ్మశానవాటికకు దారి

ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక నాయకులు లగడపాటి వేణుగోపాల్ గొడవర్రులో ఎస్సీ శ్మశానవాటిక దారికి అవసరమైన ఒకటిన్నర సెంటు స్థలాన్ని విరాళంగా ఇస్తూ పత్రాల్ని గ్రామ సర్పంచ్ జానకీదేవికి అందించారు.

పోలేరమ్మకు జలాభిషేకం

వంగిపురం (ప్రత్తిపాడు): మండలంలోని వంగిపురంలో శ్రీ పోలేరమ్మ తల్లి తిరునాళ్ల మహోత్సవాలు వైభవోపేతంగా నిర్వహిస్తున్నారు. నాలుగు రోజుల పాటు జరగనున్న ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజు సోమవారం అమ్మవారికి 108 జల బిందెలు, పంచామృతాలతో అభిషేకాల్ని నేత్రపర్వంగా నిర్వహించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేకంగా కుంకుమార్చనతో పాటు పూజల్ని అర్చకుడు వల్లూరి అగస్త్యేశ్వరశర్మ చేశారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ సభ్యుడు ఇక్కుర్తి వెంకట్రామయ్య, గ్రామస్తులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ఆస్పత్రుల్లో రోగులకు పింఛన్ల పంపిణీ


మంగళగిరి ఎయిమ్స్‌లో పింఛన్ అందజేస్తున్న వలంటీర్ బాషా


గుంటూరులోని ఆసుపత్రిలో పింఛన్ అందజేస్తున్న వలంటీర్ షేక్ ఆయేషా

పెదకాకాని: అనారోగ్యంతో ఆసుపత్రుల్లో చేరి చికిత్స పొందుతున్న రోగుల అడ్రస్ తెలుసుకుని మానవతా దృక్పథంతో అక్కడకు వెళ్లి వలంటీర్లు సోమవారం పింఛన్లు పంపిణీ చేశారు. పెదకాకాని 1వ సచివాలయం పరిధిలో వృద్ధాప్యం ఫించన్ అందుకుంటున్న షేక్ హబీబుల్లా శ్వాసకోశ సంబంధిత వ్యాధితో గుంటూరులోని ఐడీ ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. సమాచారం అందుకున్న వలంటీర్ షేక్ ఆయేషా అక్కడకు వెళ్లి నగదు అందజేశారు. 5వ సచివాలయం పరిధిలో ఉన్న షేక్ గౌసియా మానసిక వికలాంగురాలు. అంగవైకల్యానికి తోడు కిడ్నీ సమస్య తలెత్తి, మంగళగిరి ఎయిమ్స్‌లో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న వలంటీర్ షేక్ అమీర్ బాషా అక్కడకు వెళ్లి నగదు అందజేశారు. శ్రమకోర్చి నగదును పంపిణీ చేసిన వలంటీర్లను సర్పంచి గోళ్ల స్వరూపరాణి, పంచాయతీ కార్యదర్శి అంగలకుదురు సాంబశివరావు, సచివాలయ సిబ్బంది అభినందించారు.

రైతుల ఆశల్ని దెబ్బతీసిన అకాల వర్షం

కల్లాల్లో తడిసిన మొక్కజొన్న, తెల్లజొన్న, మిర్చి


చేబ్రోలులో నీటిలో నానుతున్న మొక్కజొన్న కండెలు.


గొడవర్రులో మిర్చి తడవకుండా టార్పాలిన్ పట్టలు కప్పిన రైతులు.


పెదకాకానిలో వర్షానికి తడవకుండా కప్పిన పట్టలు

చేబ్రోలు: అకాల వర్షం రైతుల్ని తీవ్రంగా దెబ్బతీసింది. ఆదివారం రాత్రి, సోమవారం ఉదయం కురిసిన భారీ వర్షం మొక్కజొన్న, జొన్న, అవరాలు, మిర్చికి అపార నష్టం కలిగించింది. మండలంలోని మంచాల, తోట్లపాలెం, చేబ్రోలు, సుద్దపల్లి, శ్రీరంగపురం తదితర గ్రామాల్లో మొక్కజొన్న, తెల్లజొన్న పంటలు నీట మునిగాయి. కల్లాల్లో ఆరబోసిన మిర్చిని కాపాడుకోవడానికి రైతులు నానా తంటాలు పడ్డారు. టార్పాలిన్ పట్టలు వేసి రక్షణ కల్పించినా అక్కడక్కడా తడిసింది. మరో రెండు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు రైతుల్ని ఆందోళనకు గురి చేస్తున్నాయి.

పెదకాకానిలో... అకాల వర్షం వదలకపోవడంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. కల్లాల్లో ఆరుతున్న మిరపకాయలు, మొక్కజొన్నలు తడవకుండా పట్టలు కప్పి పంటను కాపాడుకుంటున్నారు. మూడు రోజులుగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని వర్షపు జల్లులు పడుతున్నాయి. పెదకాకాని మండలంలోని వెనిగండ్ల, కొప్పురావూరు, తక్కెళ్లపాడు, పెదకాకాని గ్రామాల్లో మిరపకాయలు చివరి దశ కోతలు కోస్తున్నారు. పలువురు రైతుల మిరప కాయలు కల్లాల్లో ఎండుతున్నాయి. రబీలో సాగు చేసిన మొక్కజొన్న, జొన్నలు కూడా కల్లాల్లో ఆరుతున్నాయి. ఈ దశలో సోమవారం కూడా వర్షం కురవడంతో పంటల్ని కాపాడుకోవడానికి రైతులు నానా అవస్థలు పడుతున్నారు. వరుణుడు కరుణించాలని ప్రార్థిస్తున్నారు.